


## 'రావేయ్ శాస్త్రీ! ఇవాళ ఏమి ఇంత లేట్?'

"శర్మా! నీకు ఇల్లాలూ ఇల్లూ పిల్లలూ పోషణ ఏమరంతైనాలేదు. అదృష్టవంతుడివి. ఎంత పుణ్యం చేసుకున్నావో! నాలుగు గంటలు కాగానే టింగురంగా అని పార్కుకి దయచేస్తావ్ నాకెలా అవుతుంది?"

"విన్నావోయ్ వర్మా! శాస్త్రిగోడు నేను ఏమిలేనివన్నాడివి. శర్మ బండెడు సంసారం బరువు మోస్తున్న బైతు."

"ఇంటి పోషణ పట్టించుకోనక్కర లేదు నీకు. ముగ్గుబుట్ట దగ్గరినుంచి బియ్యం బుట్ట దాకా చూసుకోవలసే బైతుని నేను నీమాటలో."

"అంటే"

"అంటే ఏమిటి? మీ ధర్మపత్ని రెండు చేతులా సంపాయిస్తూ గుట్టుగా ఇల్లు నాసుకుంటూంది. నీ రంగేళీ రంకెలు సాగుతున్నాయి. మా గృహలక్ష్మి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే."

"అంటే నాకు ఇల్లువదిపే పూచీలేనేగా నీ ఉద్దేశం!"

"వేరే చెప్పాలా?"

"అయితే చెప్తాను విను శాస్త్రీ! వర్మా! నువ్వుకూడా వినాలి."

"వింటాముగాని ఒక్క దమ్ముతియ్యాలి. ఆ జేబులో ఉన్న...."

"నీముష్టి ముక్కలుతామా-అలవాటు చేసుకున్నవాడివి అర్థరూపాయి యిచ్చి సిగరెట్లు కామకోక్కలేవూ?...."

శర్మా! నీ ప్రశ్నకి నేను చెప్తాను జవాబు విను. ఇక్కడ- అంటే పార్కులో మన ముందు పొట్టేల్లాగా తల ఊపుతూ నవ్వాలు కొడతాడుగాని వర్మ ఇంట్లో పిల్లి. ఇంకా చెప్పాలంటే గోడనంటుకున్న బల్లి...."

"అంటే?"

"అంతే. ఇంకా విడమర్చి చెప్పాలా? చీపురుపుల్ల దగ్గరినుంచి చిలకకొయ్యవరకు సవరించుకుని సర్దుకుని ఇల్లు నడపడం ఆవిడవంతు. తెచ్చిపెట్టడం వర్మ వంతు. ఏదేనా కావాలంటే ఆవిడ దయాధర్మభిక్షగా యీయనగారు కుక్కిన పేనులాగా గుటకలు వేసుకుంటూ కూర్చోవలసిందే.

"శాస్త్రీ! నువ్వు మరీ అతిశయోక్తిగా మాటాడుతున్నావు."

"నాకు అతిశయోక్తులు తెలియవు. నేను అనేదంతా స్వభావోక్తే. కాదంటావా? ఆసిగరెట్టు ఇచ్చి నువ్వే అడుగు చెప్తాడు."

(సిగరెట్టుతీసుకుని వర్మ ఒకపీల్చుపీల్చి)

"చాలా ఘాటుగా ఉందే. శర్మగారూ బ్రాండు మార్చారా?"

"కాలానుసారంగా క్రింది మీదవుతుంది. మీదు క్రిందవుతుంది. ఇంతకీ కాల్చిపారేయడానికి ఏ బ్రాండయితే ఏమిటిగాని శాస్త్రి చెప్పినది...."

"మరీఅంత బరిదిగిన బంగారక్క కాదుగాని మా శ్రీమతి కొంచెం శ్రుతిమించి వడిచే సుదతి- అవి ఒప్పుకుంటాము. లెక్కపెట్టి రోజుకి ఇన్ని సిగరెట్లు మాత్రమే కాల్చాలి అవి లెక్కవేసి తానే కొనితెచ్చి యిస్తుంది."

"మరి మీరు?...."

"అతనికేమిటయ్యా! బంగారు పిచిక. రంగేలీరాముడు. శృంగార భీముడు. వారి శ్రీమతి యీచేతా ఆచేతా సంపాదిస్తూంది ప్రొఫెసరుగా కాలేజీజీతం వదారువందలు. ట్యూషన్ మూలంగా నాలుగు వందలు. ఈయనగారు సినిమా పాటలు వ్రాసి వంటో ఏత్తైయో గుంజుతూఉంటారు. పిల్లాపిచికా పోషణకి సరిపోయే ఇంటిఅద్దె అయిదొందలు. ఒక్కటే చెప్తాను విను వర్మా! ఆడది సంపాదించడం అనేది ఉందంటే ఇక అడగడం ఎందుకూ?"

"శాస్త్రీ! ఆడది సంపాయించడం దోషమా? చదువుకొని ఇంట్లో గోళ్లు గిల్లుకుంటూ కూర్చునేంత నీచ లక్షణం లేదు. మీ పెరడు అంతపెద్దదిగా ఉందికదా! నాలుగు రకాల కూరపాదులూ పువ్వుల మొక్కలూ వేసుకోకూడదూ? సొంత పెరటికూర. సొగని పువ్వులు. కడుపునిండా తినొచ్చు. పువ్వులు దేవుడిపూజకు, మీ ఆవిడ కొప్పు సింగారానికీ ఒప్పుగా సరిపోతూఉంటాయి. డబ్బులు మిగుల్తాయి. కూరలమ్మేవాడి కారు కూతలకి గురికానక్కరలేదు. ఏమంటావు? శాస్త్రీ!"

"ఏమంటాను? ఒళ్లువంచాలి. అదేకుదరదు"

"నీకూ నీయింటికీ పనికివచ్చే పనిచెయ్యడానికి ఒళ్లువంగదు. అయినవాళ్ళనీ కానివాళ్ళనీ నోటికివచ్చినట్టు వేళాకోళం చెయ్యడానికి నోరు ఒప్పుతుంది. చూడు!

పైవాళ్ళు చేసే పనులవల్లన తమనసుకి నొప్పి కలిగిందంటే ఆ పనులు పైవాళ్ళకి తాను చెయ్యకూడదు.

నువ్వు వర్మని ఇంటి విషయాలు బయట పెట్టి అతని తట్టాభాయిచేసి నువ్వు నవ్వుతున్నావు. రేపు నీకూ ఆ గతి పట్టవచ్చు. "లే. పార్కులో దీపాలు వెలిగాయి. ఇంటికి చేరకపోతే వర్మకి తకతధిగిణతొం...." ❋